కనకాల మైసమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న గువ్వల బాలరాజు

మైసమ్మను దర్శించుకున్న గువ్వల

అచ్చంపేట రూరల్, మార్చి 31: బల్మూరు మండలం జిన్‌కుంట శివారులోని కనకాల మైసమ్మ అమ్మవారిని ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్రాబాద్, అచ్చంపేట, వంగూరు మండలాల్లో పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు.

మల్లన్న కల్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎమ్మెల్యేకుఆ హ్వానపత్రికనుఅం దజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కల్వకుర్తి, మార్చి 31 : మండలంలోని జిల్లెల గ్రామంలో ఈనెల 3న నిర్వహించనున్న మల్లన్న కల్యాణోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డికి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి సన్మానం

ఎమ్మెల్యేనుస న్మానిస్తున్న స్థానికులు

బిజినేపల్లి, మార్చి 31: మండల కేంద్రంలోని చర్చిలో ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి పాల్గొని క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రైస్తవ మతపెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉగాది పురస్కారాలు

అవార్డుఅం దుకుంటున్నకళా కారులు

కొల్లాపూర్, మార్చి 31: చిన్నచింతకుంట మండలం కురుమూర్తి ఆలయం ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్ట్ ఆదివారం వివిధ రంగాలకు చెందిన కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందకున్నవారిలో కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన జీకే వెంకటేశ్, ఆమనికృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు.

రోడ్డు నిర్మాణానికి విరాళం అందజేత

విరాళంఅ ందజేస్తున్న జనార్దన్‌రెడ్డి

ఊర్కొండ, మార్చి 31 : మండలంలోని బొమ్మరాజుపల్లి పరిధిలో చెన్నయ్య గుట్టపై నిర్వహించే ఉత్సవాలకు వెళ్లే రోడ్డు మార్గానికి ఊర్కొండ పేట పరిధిలోని తాగుర్‌తండావాసులు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డుమార్గానికి మండల భాజపా నాయకుడు జిల్లా కరాటే, కబడ్డీ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి రూ.11వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వీరస్వామి, రవినాయక్, దేవేందర్‌నాయక్, బ్రహ్మం, లచ్చిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నడింపల్లి వై చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అచ్చంపేట రూరల్, మార్చి 31: మండలంలోని నడింపల్లి శివారులోని వై చౌరస్తా, మహబూబ్‌నగర్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. రెండోఎస్సై చిన్న అంజన్న మాట్లాడుతూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 4వ తేదీ వరకు పార్లమెం ట్ ఎన్నికలకోడ్ అమలులో ఉంటుందని రూ.50 వేలకు మించి నగదు ఆధారాలు లేకుండా తరలిస్తే సీజ్ చేస్తామని తెలిపారు. అదేవిధంగా అక్రమంగా మద్యం తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వెల్దండ, మార్చి 31 : ఈ నెల 7న మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ పుష్పలత ఆదివారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి ప్రవేశానికి పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి ప్రవేశపరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి, 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. telanganams.cgg.gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

పకడ్బందీగా 'పది' మూల్యాంకనం

- 3వ తేదీ నుంచి 10 వరకు ..
- జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- పటిష్టంగా నిర్వహిస్తాం : డీఈవో

నాగర్‌కర్నూల్, మార్చి 31: పదో తరగతి వార్షిక పరీక్షా పత్రాల మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అందుకుగానూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లు, సిబ్బందికి కేటాయించిన వసతులు, నిబంధనలు తదితర వివరాలను డీఈవో గోవిందరాజులు ఆదివారం వెల్లడించారు. పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని 3వతేదీ నుంచి 10వ తేదీ వరకు కొనసాగనుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి సుమారు 1,53,753 పేపర్లు మూల్యాంకనానికి రానున్నాయి. ఇందుకోసం వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 765 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో మూల్యాంకనం నిర్వహించే అసిస్టెంట్ ఎగ్జామినర్లతోపాటు వాటిని పరిశీలించడానికి చీఫ్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు క్యాంప్ ఆఫీసర్‌గా, ప్రభుత్వం పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, నోడల్ అధికారి కుర్మయ్య డిప్యూటీ క్యాంప్‌ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారు. మరోఏడుమంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లుగా ఉండనున్నారు.

ముగ్గురు ఏఈలకు ఒక సీఈ, స్పెషల్ అసిస్టెంట్

సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయడానికి ముగ్గురు చొప్పున అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ) ఒక బృందంగా ఏర్పాటు చేస్తున్నారు. ముగ్గురు ఏఈలకు ఒకచీఫ్ ఎగ్జామినర్(సీఈ)తోపాటు ఒక స్పెషల్ అసిస్టెంట్ ఉంటారు. ఒక్కో ఏఈ రోజుకు 40 సమాధాన పత్రాలను మూల్యాంకణం చేయాల్సి ఉంటుంది. ఏఈలు మూల్యాంకనం చేసిన పత్రాలు వేసిన మార్కులను నిశితంగా పరిశీలిస్తారు. జవాబు పత్రాల్లో ఏఈలు వేసిన మార్కుల టోటల్ వేసే విధులను స్పెషల్ ఆసిస్టెంట్లు నిర్వహిస్తారు. ఈ విధంగా ఒక బృందం రోజుకు 120 సమాధాన పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు వేయడంతోపాటు వేసిన మార్కులు సరిగా ఉన్నవి, లేనివి క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. క్యాంప్ అధికారికి సహాయకులుగా సహాయక్యాంప్ అధికారులను నియమించారు. సీనియర్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు మూల్యాంకన విధుల్లో సీఈ, ఏఈ, స్పెషల్ అసిస్టెంట్లుగా ఉంటారు.

765 మంది టీచర్ల నియామకం

రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన 1,53,753 పేపర్లలో స్థానిక లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో లాంగ్వేజ్ పేపర్లు, సబ్జెక్టుల పేపర్లు మూల్యాంకణం చేయనున్నారు. దీనికోసం 609 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో చీఫ్ ఎగ్జామినర్లుగా 100మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 609 మంది, స్పెషల్ అసిస్టెంట్లుగా 142 మంది, క్యాంప్‌స్టాఫ్‌గా 14మంది మొత్తం 765 మంది విధులు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం చేయనున్నారు. విధులకు హాజరయ్యే సిబ్బందికి ఇప్పటికే బార్‌కోడ్, ఇతర వాటిపై శిక్షణ ఇచ్చారు. వారికి కావాల్సిన అన్ని మౌలిక వసతులను ప్రభుత్వ పరీక్షల విభాగం కల్పించనుంది. మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. మూల్యాంకనం పూర్తయ్యే వరకు అటువైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వెంట తీసుకెళ్లరాదనే నిబంధన పెట్టనున్నారు. టీచర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటలవరకు మూల్యాంకన కేంద్రంలో ఉండాల్సిఉంది. వారికి అవసరమైన వసతులు కల్పించారు. కాగా పోలీసుల బందోబస్తు చర్యలు చేపడుతున్నారు.

నాగర్‌కర్నూల్‌లో మూల్యాంకనంచేప ట్టనున్న కేంద్రం

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

బుధవారం నుంచి నిర్వహించనున్న పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశాం. మూల్యాంకణ విధులకు హాజరయ్యే సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. తాగునీరు, గదుల్లో లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయం కావున సిబ్బంది మార్కులు వేసే విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించాలి.

–గోవిందరాజులు,డీ ఈవో, నాగర్‌కర్నూల్

ప్రమాదమనితె లిసినా..

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- బస్సుసౌకర్యం కల్పించాలని వేడుకోలు

కోడేరు, మార్చి 31 :ప్రమాదమని తెలిసినా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగులపల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, వివిధ గిరిజన తండాలకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు వాపోతున్నా రు. ఆయా గ్రామాల నుంచి ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు, ప్రజలు వివిధ పనులపై మండల కేంద్రానికి వెళ్తుంటారు. కాగా ఆయా గ్రామాలకు ఉదయం తప్పితే మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడంతో ప్రమాదమని తెలిసినా ఆటోలు, జీపులపై కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండాకాలం ఒంటి పూటబడులు కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం పాఠశాలల నుంచి స్వగ్రామాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో గత్యంతరం లేక ప్రైవేటు వాహనాల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వాహనదారులు సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారని ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో బస్సుసౌకర్యం కల్పించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేటు వాహనంపైవెళ్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

నాగర్‌కర్నూల్, మార్చి 31: జిల్లా కేంద్రంలో ఎంబీ చర్చిలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి సమీపంలోని గుట్టపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రెవరండ్ పురుషోత్తం బాప్తీసం కార్యక్రమం నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన బైబిల్ క్విజ్ పోటీల్లో విజేతలకు అడ్వకేట్ శ్రీకర్‌బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మల్లురవి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాస్టర్ భాస్కర్, సంఘ పెద్దలు ఏలియా, నయేనియల్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో..

కల్వకుర్తి,కల్వకుర్తి రూరల్ మార్చి 31 : పట్టణంలోని వార్కంటీస్ మెమోరియల్ ఎంబీ చర్చిలో ఆదివారం క్రైస్తవ సోదరులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి వేడుకలను ప్రారంభించారు. ఎంబీ చర్చికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిపాస్టర్ రెవరండ్ జేబీ రాజ్ దైవ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో చర్చి కమిటీ చైర్మన్ జోహర్న, వైస్‌చైర్మన్ స్టీఫెన్‌సన్, కార్యదర్శి రామస్వామి, జగదీశ్, ఇజ్రాయిల్, కృష్ణమూర్తి, రాజు,సురేశ్‌బాబు, ప్రభాకర్,రవి, నందు, జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని పంజుగుల, తర్నికల్, జిల్లెల, మార్చాల, లింగసానిపల్లి, రఘుపతిపేట, సత్యసాయినగర్ కాలనీలలో చర్చీలలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని చర్చీలను చక్కగా అలంకరించారు. ఈ సందర్భంగా చర్చీలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సొసైటీలో లావాదేవీలను తెలపాలి

సమావేశంలో మాట్లాడుతున్నఇ న్‌చార్జి విండోఅధ్ యక్షుడువెం కట్‌రెడ్డి

తాడూరు, మార్చి 31 : మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో ఆదివారం ఇన్‌చార్జి చైర్మన్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన విండో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు వివిధ సమస్యలపై సంబంధిత అధికారులను ప్రశ్నించారు. సొసైటీలో లావాదేవీలను డైరెక్టర్లకు ఎందుకు తెలపడం లేదని సీఈవో ఆంజనేయులును ప్రశ్నించారు. మూడేండ్ల నుంచి ధాన్యం కొనుగోలుతో పాటు ఎరువులు, విత్తనాల విక్రయాల లాభాలను సభ్యులందరికీ చెప్పాలన్నారు. వచ్చే సమావేశం వరకు లాభాల గురించి పూర్తి సమాచారం ఇస్తామని అధికారులు వివరించారు. అనంతరం ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు, రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సొసైటీ ద్వారా ప్రభుత్వం రాయితీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సమ్మద్ పాషా, డైరెక్టర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్ట్ సభ్యులు

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 31 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణల్లో ఆదివారం సత్యసాయిబాబా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ గత 45 ఏండ్లుగా నాగర్‌కర్నూల్‌లో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడ్తునామన్నారు. అందులో భాగంగా వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ ఈశ్వరయ్య, బాలకృష్ణ, స్వామి, శ్రీరాములు, పాండురంగారెడ్డి, వెంకట్‌శెట్టి, లక్ష్మణ్, మణ్నెపురెడ్డి, పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం

వంగూరు, మార్చి 31 : మండలంలోని గాజరలో ఆదివారం ప్రజలు ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి అందరూ తమతమ పొలాలకు వెళ్లి సామూహికంగా వంటలు చేసుకుని భోజనం చేశారు. అనంతరం కలిసి బతుకమ్మ ఆడటంతో పాటు డ్యాన్సులు చేస్తూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా బతుకుమ్మ, వివిధ క్రీడలను ఆడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

అట్టహాసంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలు

కొల్లాపూర్, మార్చి 31: మండలంలోని చౌటబట్లలో ఉగాది పండుగను పురస్కరించుకొని చౌటబట్ల యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కొల్లాపూర్ సీఐ మహేశ్,ఎస్సై రుషికేశ్ ముఖ్యఅతిథులుగా హాజరై టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈపోటీల్లో మొత్తం 40 జట్లు పాల్గొంటున్నాయని క్రీడా నిర్వాహకుడు జగదీశ్‌గౌడ్ తెలిపారు. మొదటి మ్యాచ్‌లో కోడేరు మండలం మైలారం టీం, కొల్లాపూర్ ఇందిరాకాలనీ జట్లు తలపడగా మైలారం టీంవిజయం సాధించింది. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ ధర రూ.7052

కల్వకుర్తి, మార్చి 31 : కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం వేరుశనగ క్వింటాకు రూ.7,052 ధర పలికింది. 56 మంది రైతులు తాము పండించిన వేరుశనగ, ఆముదాలను విక్రయించేందుకు కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకువచ్చారు. వేరుశనగ ధాన్యానికి వ్యాపారులు రహస్యటెండర్ నిర్వహించారు. గరిష్ఠ ధర రూ.7,052, కనిష్ఠ ధర రూ.5,604, మధ్యస్తధర రూ.5,660కి కొనుగోలు చేశారు. రైతులు వేరుశనగను 440 క్వింటాళ్లు తీసుకురాగా, 102.50 క్వింటాళ్లు ఆముదాలను తీసుకొచ్చారు. ఆముదాలను రూ. 5,660కి కొనుగోలు చేశారు

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి

వెల్దండ, మార్చి 31 : ఆపదలో ఉన్నవారికి తమవంతు సహాయం అందించి అండగా నిలవాల్సిన బాధ్యత పౌరులపై ఉందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మైక్రో డొనేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాదగిరి, శ్రీనివాసచారి, జంగయ్య, బాలస్వామి, రామస్వామి విష్ణు ఉన్నారు.

చిన్నారులకు క్రీడాసామగ్రి అందజేత

క్రీడసామగ్రిఅం దజేస్తున్న దృశ్యం

అచ్చంపేట రూరల్, మార్చి 31: మండలంలోని పులిజాలకు చెందిన చిన్నారులకు ఆదివారం గ్రామ యువకుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఆటవస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు ఉండడంతో పిల్లలు కాలక్షేపానికి ఆడుకోవడానికి బ్యాట్, బాల్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువకులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బిజినేపల్లి, మార్చి 31: మండలంలోని మంగనూర్‌లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల వి ద్యార్థులు రైతులకు విత్తన శుద్ధిపై అవగాహ న కల్పించారు. విద్యార్థులు విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి వంటి అంశాలపై రైతులకు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం వివిధ రకాల పంటలు సాగువిధానం, యాంత్రీకరణ, చీడపీడలనివారణ వంటి అంశాలపై వివరించారు.

వీధిదీపాల ఏర్పాటు

వీధిదీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కొల్లాపూర్, మార్చి 31: మండలంలోని సున్నపుతండా కొత్త కాలనీలో ఎంపీటీసీ శంకర్‌నాయక్ పర్యవేక్షణలో ఆదివారం గ్రామపంచాయతీ సిబ్బంది వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండావాసుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీధి దీపాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ శంకర్‌నాయక్‌కు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు.